# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 199. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ శుక్రవారం.25.04.2025 పేజీలు:4, వెల:రూ.1.00


## పాక్ జాతీయులకు వీసా సర్వీసుల నిలిపివేత

న్యూఢిల్లీ: అమృత్ తెలంగాణ: పహల్గాం ఉగ్ర దాడి దరిమిలా పాకిస్థాన్‌పై తీసుకున్న ప్రతీకార చర్యల కొనసాగింపుగా తక్షణమే పాకిస్థానీలకు వీసా సేవలను నిలిపివేస్తున్నట్లు భారత్ గురువారం ప్రకటించింది. పాకిస్థానీలకు జారీ చేసిన వీసాలన్నీ ఏప్రిల్ 27 నుంచి రద్దయినట్లేనని విదేశాంగ శాఖ ప్రకటించింది పాక్ జాతీయులకు జారీచేసిన మెడికల్ వీసాలు ఏప్రిల్ 29 వరకు మాత్రమే చెల్లుబాటు అవుతాయని కేంద్రం తెలిపింది. వీసాల గడువు ముగిసేలోగా దేశంలో ఉన్న పాక్ జాతీయులందరూ భారత్‌ను వీడాలని ప్రభుత్వం ఆదేశించింది. పాక్‌లోని భారతీయులందరూ త్వరగా దేశానికి రావాలని కోరింది.

## నిలోఫర్‌లో అదుపు తప్పిన పాలన

హైదరాబాద్, ఏప్రిల్ 24:అమృత్ తెలంగాణ: నిలోఫర్ దవాఖానలో పాలన గాడితప్పింది. అధికారులపర్యవేక్షణలోపంతో కిందిస్థాయి ఉద్యోగులు రెచ్చిపోతున్నారు. బ్లడ్ బ్యాంక్‌లో నుంచి బ్లడ్ ప్యాకెట్లు మాయమైన ఉదంతంపై ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక రాకముందే తాజాగా మందుల చోరీ వెలుగులోకి రావడం గమనార్హం. దవాఖాన వర్గాలు,విశ్వసనీయంగాఅందినసమాచారం ప్రకారం నిలోఫర్ దవాఖానలో ఓ మహిళ తన తండ్రి మరణించడంతో కారుణ్య నియామకం కింద ఉద్యోగంలో చేరి,లిఫ్ట్‌ఆపరేటర్‌గాపనిచేస్తున్నది. దవాఖానలోనిమరికొందరుఉద్యోగుల సహకారంతో ఖరీదైన మందులు,ఇంజక్షన్లు,ఇతరక్లినికల్ సామగ్రి వంటి వాటినితస్కరించిసంచుల్లో భద్రపరుస్తుంది. ఆయా మందులకొరత ఏర్పడటంతో దవాఖానసిబ్బంది వైద్యులురాసినమందులనుబయటనుంచితెచ్చుకోవాలని సూచిస్తారు. అప్పటికప్పుడు ఆమందులు ఎక్కడ దొరుకుతాయో వాకబు చేసే లోపే విషయాన్ని గమనించి, తానుతెప్పించిఇస్తానంటూరోగిసహాయకులవద్దనుంచి డబ్బులువసూలు చేసితస్కరించినమందులనువారికిఅందజేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

# 3 స్పాట్‌లు.. 10 నిమిషాలు.. ఐదుగురు ముష్కరులు





న్యూఢిల్లీ:అమృత్ తెలంగాణ: పహల్గాం ఉగ్రదాడికి సంబంధించి కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. దర్యాప్తు సంస్థలు వెల్లడించిన వివరాల ప్రకారం కనీసం ఐదుగురు సభ్యులతో కూడిన ముష్కర మూక ఈ దారుణంలో పాలుపంచుకుంది. గడ్డిమైదానాన్ని ఆనుకుని ఉన్న దేవదారు చెట్లతో ఉండే అటవీ ప్రాంతం నుంచి ముందు నిర్దేశించుకున్న విధంగా పర్యాటకులు అధిక సంఖ్యలో ఉండే మూడు ప్రాంతాలకు ముష్కరులు చేరుకున్నారు. వీరివద్ద రైఫిళ్లతో పాటు జరిగిన దృశ్యాలను రికార్డు చేయడానికి బాడీ కెమెరాలు కూడా ఉన్నాయి. మధ్యాహ్నం 1.50 గంటలకు మొదటి ఫైరింగ్ చోటుచేసుకుంది.

ఒక్కసారిగా ఉగ్రవాదుల కాల్పులు జరగడంతో పర్యాటకులు భీతావహులయ్యారు. వారు ఒక్కో పర్యాటకుడి వద్దకు వెళ్లి వారి మతాన్ని అడిగి, వారికి ఇస్లామిక్ పద్య పరీక్ష నిర్వహించి నిర్ధారించుకున్న తర్వాతే కాల్చి చంపారు. 10 నిమిషాల పాటు ఈ నరమేధం సాగింది. తర్వాత వారు వచ్చిన దారిలోనే అటవీ మార్గం గుండా పారిపోయారు. ఈ దాడి జరిగిన సుమారు అరగంట తర్వాత 2.30 గంటలకు పోలీసులకు సమాచారం అందింది. అయితే అక్కడకు చేరుకోవడానికి వాహన మార్గం లేకపోవడంతో కాలినడకన, లేదా గుర్రాలపై అక్కడికి చేరుకోవాలి. దీంతో పోలీసులు ఘటనా స్థలికి మూడు దాటిన తర్వాతే చేరుకున్నారు. కాల్పులకు గురైనవారు కొంత సేపు ఊపిరితోనే ఉన్నారని, అత్యవసర చికిత్స అంది ఉంటే కొందరైనా బతికి ఉండేవారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

మతం కన్నా మానవత్వం ముఖ్యం.. బాధితులను వీపుపై ఎక్కించుకుని తరలించిన ముస్లిం వ్యాపారి

శ్రీనగర్: మతం ఆధారంగా కొందరు ముష్కరులు పహల్గాంలో నరమేధానికి దిగగా, మతం కన్నా మానవత్వమే ముందుండాలని నిరూపించారు స్థానికులు. 'మా జీనవాధారానికి కారణమైన వారిని అలా చూసి కన్నీళ్లు ఆగలేదు. అందుకే మా ప్రాణాలు ఏమైనా పర్వాలేదనుకుని గాయపడ్డ వారిని రక్షించిడానికి ప్రయత్నించాం' అని స్థానిక శాలువాల వ్యాపారి సాజద్ అహ్మద్ భట్ పేర్కొన్నారు. గాయపడ్డ వారిని వీపుపై ఎక్కించుకుని దవాఖానకు తరలించి మతం కంటే మానవత్వం ముఖ్యమని నిరూపించారు.

బైసరాన్‌లో పర్యాటకులను రక్షించడానికి అవసరమైన సహాయం అందించాలంటూ పోనీ అసోసియేషన్ అధ్యక్షుడు పెట్టిన మెసేజ్ చూసి వెంటనే అక్కడకు చేరుకున్నానన్నారు. గాయపడ్డ వారికి మంచినీరు అందించి గాయపడి, నడవలేని స్థితిలో ఉన్న వారిని వీపుపై ఎక్కించుకుని అక్కడి నుంచి తీసుకువచ్చినట్టు భట్ తెలిపారు. 'మతం కన్నా మానవత్వం ముందు వస్తుంది. పర్యాటకులు మా అతిథులు. వారిని గౌరవించడం మా ధర్మం. మా జీవనాధారం వారే. గాయపడిన చాలామందిని దవాఖానకు తీసుకుని వచ్చాం' అని తెలిపారు.





ప్రేమతో మీ బామ్మర్ది అమృత్ తెలంగాణ తెలుగు దినపత్రిక చైర్మన్



# చెరువుల పరిరక్షణలో అదే నిర్లక్ష్యం

## హైకోర్టు అక్షింతలు వేసినా.. మారని జీహెచ్‌ఎంసీ అధికారుల పనితీరు

## బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన సుందరీకరణ పనులు నిలిపివేసిన వైనం

## గుర్రపు డెక్క, మురికి కూపం, కబ్జాలపై స్థానికుల ఫిర్యాదులు

హైదరాబాద్, ఏప్రిల్ 24:అమృత్ తెలంగాణ: చెరువుల పరిరక్షణలో జీహెచ్‌ఎంసీ అధికారుల వైఖరి మారడం లేదు..చివరకు హైకోర్టు అక్షింతలు వేసిన పనితీరులో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. ఫలితంగా చెరువుల ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీటితో దుర్గంధానికి తోడు దోమల బెడద స్థానికులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. వాస్తవంగా రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల పరిధిలో 13 చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయని, పరిరక్షణ విషయంలో జీహెచ్‌ఎంసీ చర్యలు తీసుకోవడం లేదన్న 'గమన' స్వచ్ఛంద సంస్థ ఈడీ దయాకర్ పిటిషన్‌పై సమగ్ర విచారణ చేపట్టిన న్యాయస్థానం జీహెచ్‌ఎంసీకి మొట్టికాయ వేస్తూనే 13 చెరువుల దయనీయస్థితిపై ఇద్దరు కోర్టు కమిషనర్ల కమిటీ నియమించి విచారణ జరిపించింది. న్యాయవాదులు ప్రవీణ్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి సభ్యులుగా నియమితులైన ఈ కమిటీ.. జీహెచ్‌ఎంసీ అధికారులు, హైదరాబాద్ , రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు చెరువుల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలేమిటన్నది పరిశీలించింది. జంట జిల్లాల్లోని 13 చెరువులను పరిశీలించి తమ నివేదికను ఇటీవల హైకోర్టుకు సమర్పించింది. రక్షణ చర్యలు చేపట్టకపోవడం వల్లే చెరువులు ఆక్రమణకు గురయ్యాయని హైకోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొంది. ఈ చెరువుల కాలుష్యం కేవలం పర్యావరణానికి మాత్రమే కాకుండా.. ప్రజా ఆరోగ్యానికి కూడా తీవ్ర ముప్పుగా పరిణమించే అవకాశాలున్నాయని తెలిపింది. ఆక్రమణలు, కాలుష్యం కారణంగా చెరువులపై ఆధారపడిన పక్షులు, జంతుజాలం, జలచరాలు అంతరించిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇందులో భాగంగానే హస్మత్‌పేట బోయిని చెరువు, చందానగర్ గంగారం చెరువు, దుండిగల్ చిన్న దామెర చెరువు, మద్దెలకుంట చెరువు బైరామల్ గూడ, నల్లగండ్ల చెరువు, పెద్ద చెరువు పీర్జాదిగూడ, అంబీర్ చెరువు కూకట్‌పల్లి, చిన్నరాయుని చెరువు అల్వాల్, దుర్గం చెరువు, ఉప్పల్ నల్ల చెరువు, సున్నంచెరువుల పరిరక్షణపై జీహెచ్‌ఎంసీ ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉన్నప్పటికీ నెలల తరబడి పరిరక్షణలో జాప్యం చేస్తుండడం గమనార్హం.



స్టాండింగ్ కమిటీ ఆమోదించేనా?


హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఆయా 13 చెరువుల పరిరక్షణలో .. టెక్నికల్ కన్సల్టెంట్‌గా నీరి (జాతీయ పర్యావరణ, ఇంజినీరింగ్ పరిశోధన సంస్థ)ని నియమించుకుని చెరువుల నీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షలు జరపడంతో పాటు ఇరిగేషన్ సమన్వయంతో సంబంధిత చెరువుల అక్రమణకు గురి కాకుండా పక్కాగా పరిరక్షణ చర్యలు చేపట్టాలని నిర్ణయించారు ఇందుకోసం రూ. 55 లక్షల ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఎంఐఎం సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. 13 చెరువులతో పాటు అదనంగా కొన్ని చెరువులను చేర్చాలని పట్టుపట్టారు. ఈ సమయంలో మేయర్‌కు, ఎంఐఎం సభ్యుల మధ్య మాటల యుద్ధం నడిచింది. చివరకు ఈ ప్రతిపాదనను కమిటీ పక్కన పెట్టింది.

## కలలో కూడా ఊహించని శిక్షలు.. ఉగ్రవాదులకు ప్రధాని మోదీ హెచ్చరిక



మధుబని(బీహార్):అమృత్ తెలంగాణ: పహల్గాం ఉగ్ర దాడి అనంతరం గురువారం మొట్టమొదటిసారి బహిరంగంగా స్పందించిన ప్రధాని నరేంద్ర మోదీ ఆ దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులు, దాడి వెనుక ఉన్న సూత్రధారులకు తీవ్రమైన హెచ్చరికలు జారీచేశారు. వారు కలలో కూడా ఊహించని కఠినమైన శిక్షలు అనుభవిస్తారని ప్రధాని హెచ్చరించారు. బీహార్‌లోని మధుబనిలో ఓ ర్యాలీని ఉద్దేశించిన ప్రసంగించిన మోదీ భారతదేశ స్ఫూర్తిపై దాడికి ప్రయత్నిస్తే సహించే ప్రసక్తి లేదన్న సందేశం యావత్ ప్రపంచానికి తెలియచేసే ఉద్దేశంతో ఇంగ్లిష్‌లోకి మాటా డారు. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడి భారతదేశ ఆత్మపై జరిగిన దాడిగా ప్రధాని అభివర్ణించారు. 'ఈ దాడికి పాల్పడిన ప్రతి ఉగ్రవాదిని, దీని వెనుక ఉన్న సూత్రధారులను గుర్తించి, వేటాడి, శిక్షిస్తామని బీహార్ గడ్డపై నుంచి యావత్ ప్రపంచానికి ఈరోజు నేను తెలియచేస్తున్నాను. ఈ భూమిపై ఎక్కడ దాక్కున్నా వారిని పట్టుకుంటాం. ఉగ్రవాదంతో భారతదేశ స్ఫూర్తిని ఎన్నటికీ దెబ్బతీయలేరు' అని మోదీ ప్రకటించారు. ఉగ్రవాదులు కలలో కూడా ఊహించని విధంగా కఠినాతి కఠినమైన శిక్షలు ఉంటాయని మోదీ హెచ్చరించారు.

## గ్రూప్-1పై సీబీఐ విచారణ చేపట్టాలి



హైదరాబాద్, ఏప్రిల్ 24:అమృత్ తెలంగాణ: టీజీపీఎస్సీ గ్రూప్-1 అవకతవకలపై సీబీఐ సమగ్ర విచారణ చేపట్టాలని బీసీ ఆజా ది ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు సంజయ్ కుమార్ కోరారు. ఈ మేరకు ఢిల్లీలోని సీబీఐ కేంద్ర కార్యాలయం డైరెక్టర్ జనరల్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం సంజయ్ మాట్లాడారు. ప్రభుత్వం జీవో 55ను రద్దు చేసి జీవో 29 జారీ చేయడంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రిజర్వేషన్ క్యాటగిరీలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం కేటాయించి మిగతా 50 శాతం పోస్టులను అగ్రవర్ణాల వారికి కట్టబెట్టే కుట్రకు తెరలేపిందని విమర్శించారు. తెలుగు మీడియం అభ్యర్థుల ప్రమాణాలకు అనుగుణంగా వాల్యుయేషన్ చేయలేదని ఆక్షేపించారు. సీబీఐ సుమోటోగా కేసు నమోదుచేసి విచారణ చేపట్టాలని కోరారు.

## బీసీ రిజర్వేషన్లు పెంచాకే ఎన్నికలు నిర్వహించాలి: జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరిక

రవీంద్రభారతి, ఏప్రిల్ 24:అమృత్ తెలంగాణ: బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని, లేకపోతే యుద్ధం జరుగుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు(ఎంపీ)ఆర్.కృష్ణయ్య కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డిని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. గురువారం పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుపుతామని ప్రకటించడం చాలా దారుణమని, బీసీలను మోసం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం మరోమారు బీసీలను బలి చేసిందన్నారు. త్వరలో వెయ్యి మందితో ఆమరణ నిరాహార దీక్ష చేపడుతామని ఆయన వెల్లడించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. 12 నెలల కిందట జరపాల్సిన ఎన్నికలు బీసీ రిజర్వేషన్ల గురించి వాయిదా పడుతూ జాప్యం జరిగిందన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయం పూర్తిగా పరిష్కారం కాకముందే మంత్రి సీతక్క స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పడం బీసీలను మరోసారి మోసం చేయడానికి కుట్ర పన్నుతున్నదని ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఒక వేళ రిజర్వేషన్లు పెంచకుండానే ఎన్నికలకు వెళితే రాష్ట్రంలో యుద్ధమే జరుగుతుందన్నారు. ఏ మంత్రిని, ఎమ్మెల్యేలను గ్రామాల్లో తిరుగనివ్వమని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లను 20శాతం నుంచి 42 శాతం అసెంబ్లీలో చట్టం చేసి, ఇంతవరకు ప్రభుత్వం జీవో ఎందుకు జారీ చేయలేదని ప్రశ్నించారు. రాజ్యాంగం ప్రకారం స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే ఉందని 73, 74 రాజ్యాంగ సవరణ చేసినప్పుడు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 243డి-6 ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచే అధికారం ఉందన్నారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల పెంపునకు కచ్చితంగా రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు జి.అంజి, మణికంఠ, రాజునేత, నరసింహాగౌడ్, రవికుమార్, ఎస్.లక్ష్మీనారాయణ, ఫణి పాల్గొన్నారు.



## శ్రీరాం కర్రిపై ప్రెస్ కౌన్సిల్ విచారణ




హైదరాబాద్, ఏప్రిల్ 24 అమృత్ తెలంగాణ: డెకన్ క్రానికల్ దినపత్రికకు రెసిడెంట్ ఎడిటర్‌గా ఉంటూనే కాంగ్రెస్ పార్టీకి, తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయానికి మీడియా కన్సల్టెంట్‌గా పనిచేసిన శ్రీరాం కర్రి మీద ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా విచారణ చేపట్టిందని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ కొణతందిలీప్ తెలిపారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు తాను చేసిన ఫిర్యాదుపై ఎట్టకేలకు జవాబు వచ్చిందని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మీద విచారణ చేపట్టిన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా.. దీనికి కేస్ నంబర్ 656/2024/ఏ-పీసీఐ ఇచ్చి, మరికొంత సమాచారం పంపించాలని తనకు లేఖ రాసిందని తెలిపారు. వారు అడిగిన సమాచారం ఒకటి రెండు రోజుల్లో పంపిస్తానని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఓ వైపు డెకన్ క్రానికల్ దినపత్రికకు శ్రీరాం కర్రి రెసిడెంట్ ఎడిటర్‌గా ఉంటూనే, మరోవైపు 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయానికి మీడియా సలహాదారుగా పది నెలలపాటు అనధికారికంగా వ్యవహరించారు. 2024 జనవరిలో దావోస్, ఆ తరువాత లండన్, అమెరికా వెళ్లిన తెలంగాణ ప్రతినిధి బృందంతో ఆయన వెళ్లడం పత్రికా విలువలకు, మీడియా నిష్పాక్షికతకు పాతర వేసే చర్య' అని పేర్కొంటూ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేసినట్టు దిలీప్ తెలిపారు.

# విద్యుత్ ఘాతంతో ఒకరు మృతి



కరెంటు షాక్ తో మృతి చెందిన దానే విజయ్,

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి ఏప్రిల్ 24 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండలంలోని డొంగర్గం గ్రామానికి చెందిన దనే విజయ్, 51 ఏప్రిల్11 సాయంత్రం సమయంలో జంగిపల్లి చిన్నయ్య వ్యవసాయ పొలంలో గల ట్రాన్స్ఫారం దగ్గర మోటర్ పైపులను చెక్ చేస్తుండగా ప్రమాదవశత్తు విజయ్, ట్రాన్స్ఫారంకు తగలడంతో అపస్మారగ స్థితిలోకి వెళ్ళినాడు వెంటనే వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రి నిర్మల్ కు తరలించి ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండడంతో మరుసటి రోజు మెరుగన్న చికిత్స గురించి హైదరాబాదులోని గాంధీ హాస్పిటల్ కి తరలించినారు అక్కడ వైద్యం పొంది బుధవారం గాంధీ ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ చేయగా విజయ్ ని తన కుటుంబ సభ్యులు డొంగర్గం కి తీసుక వచ్చినారు. కానీ గురువారం తెల్లవారుజామున ఒంటిగంట సమయంలో మృతి చెందడం జరిగింది దనే వినయ్ పోలీస్ స్టేషన్ నర్సాపూర్ యందు దరఖాస్తు ఇవ్వగా ఎస్సై సాయికిరణ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టినారు.

## ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్రమబద్ధీకరించుకున్న వారిని సన్మానించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్.




అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : ఆమోదం పొందిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు, క్రమబద్ధీకరణ రుసుమును చెల్లించి తమ దరఖాస్తులను రెగ్యులరైజ్ చేసుకున్న జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతానికి చెందిన పలువురిని జిల్లా స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ తో కలిసి వారిని శాలువాలతో సన్మానించారు. వారికి శపుష్పగుచ్చాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు అందరికీ వీరు ఆదర్శమని తెలిపారు. ఈ నెలాఖరుతో ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ ఫీజులో 25 శాతం రాయితీ ముగుస్తుందని అన్నారు. కావున ఆమోదం పొందిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ దరఖాస్తులను క్రమబద్ధీకరించుకోవాలని తెలిపారు.

## చెక్ బౌన్స్ కేసులను రాజీ పద్ధతుల్లో పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి అన్నారు.




అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బ్యాంకు అధికారులతో చెక్ బౌన్స్ కేసుల పరిష్కారం పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలోని బ్యాంకులు, చిట్ ఫండ్స్ లలో నమోదై, పెండింగ్ లో ఉన్న చెక్ బౌన్స్ కేసులను పరస్పర రాజీ మార్గాన పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, బ్యాంకు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్ర ఘాతుకం!

అమృత్ తెలంగాణ సంపాదకీయం

కాశ్మీర్ పర్యాటకులపై మంగళవారం నాడు ఉగ్రవాదులు విరుచుకుపడి, 28 మందిని కర్కశంగా కాల్చి చంపిన దుర్మార్గ చర్య దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ ఘాతుకాన్ని అన్ని పార్టీలూ ఏకకంఠంతో ఖండించాయి. జమ్మూ కాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని కల్పించే 370 అధికరణం రద్దు తదితర చర్యల ద్వారా ఉగ్రవాదాన్ని అణచివేశామని, కాశ్మీర్‌లో ప్రశాంత వాతావరణం నెలకొల్పామని మోడీ ప్రభుత్వం ఘనంగా చెప్పుకుంటున్న నేపథ్యంలో ఈ ఉగ్రదాడి జరిగింది. ఈ దాడి తమ పనేనని ద రెసిస్టెన్స్ ఫ్రంట్ (టిఆర్ఎఫ్) అనే ఉగ్రవాద ముఠా ప్రకటించుకొంది.

జమ్మూ కాశ్మీర్ స్వయంప్రతిపత్తిని రద్దు చేసిన తరువాత 2019లో ఈ సంస్థ ఏర్పడిందని, ఇది లష్కర్ తోయిబాకు అనుబంధంగా పనిచేస్తోందని మన నిఘా సంస్థలు ప్రకటించాయి. 2019లో 44 మంది సైనికులను పొట్టనబెట్టుకున్న పుల్వావమా ఉగ్రదాడి తరువాత ఎక్కువమందిని బలిగొన్న ఈ దుశ్చర్య మోడీ ప్రభుత్వ భద్రతా వైఫల్యాన్ని ఎత్తి చూపుతోంది. మిలటరీ, జమ్మూ కాశ్మీర్ పోలీసులు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోనే ఉన్నాయన్న విషయం మరువరాదు. ప్రచారార్భాటాలకు పరిమితం కాకుండా పటిష్టమైన భద్రతా చర్యలతో పౌరులకు, పర్యాటకులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతను ఈ ఉగ్ర ఘాతుకం గుర్తు చేస్తోంది.

ఉగ్రదాడిలో రక్తమోడిన పహల్గాంలోని బైసరన్ ప్రాంతానికి మినీ స్విట్జర్లాండ్ అని పేరు. కనుచూపు మేరా అందమైన పచ్చిక బయళ్ళు, దట్టమైన పైన్ వృక్షాల సముదాయాలూ, వాటి నేపథ్యంలో ఎత్తయిన హిమనగాలూ ప్రకృతి ప్రేమికులకు అనంతమైన ఆనందానుభూతిని కలిగిస్తాయి. సముద్రమట్టానికి ఎనిమిది వేల అడుగుల ఎత్తులో ఉన్న ఆ ప్రాంతం నడి వేసవిలోనూ పది సెల్సియస్ డిగ్రీల లోపు ఉష్ణోగ్రతతో శీతల దేశాల్లో ఉన్న అనుభూతిని కలిగిస్తుంది.



ఉగ్రవాదుల దాడిలో మరణించిన భర్త వద్ద భార్య

అందువల్లనే ఏటా ఈ సీజన్లో వేలాదిమంది పర్యాటకులు బైసరన్‌ని సందర్శిస్తారు. అలాంటి చోట ఆనందంగా విహరిస్తున్న సందర్శకులపై ఉన్మాద మూక విచక్షణారహితంగా చేసిన దాడి మిగిలిన కుటుంబ సభ్యులకు జీవిత కాలపు భయానక దృశ్యం. కళ్లముందే భర్తను కోల్పోయి, నిస్త్రాణగా మిగిలిన నవ వధువుబీ చూస్తుండగానే తండ్రిని కాల్చి చంపితే అమ్మ సందిట్లో బేలగా ఒదిగిన చిన్నారులు, భారత సైనికులు సాయుధులై రక్షణగా వచ్చినప్పుడు కూడా ఇంకా భయంలోనే ఉండి, 'చంపితే నన్ను చంపేయండి.. నా కూతురిని మాత్రం వదిలేయండి.' అని ప్రాధేయపడుతున్న తల్లి ఉన్మాదులు సృష్టించిన అమానుష కృత్యానికి ఆనవాళ్ళు.

కాశ్మీర్‌లో ఉగ్రవాదులు దాడులు చేయడం, సైనికులను, పౌరులను బలిగొనటం దశాబ్దాలుగా కొనసాగుతోంది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం సరిహద్దుకు ఆవల, ఈవల అప్పుడప్పుడు విధ్వంసక దుశ్చర్యలతో తన ఉనికిని చాటుకుంటోంది. దీనికి స్థానిక యువతలోని అసంతృప్తి, పరాయీకరణ, అనుమానిత నిఘా, నిరుద్యోగం వంటివి కారణమవుతున్నట్టు గతంలో అనేక అధ్యయనాలు వెల్లడి చేశాయి. దేశ సరిహద్దు ప్రాంతాల, పౌరుల అభివృద్ధికి పాలకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, అభివృద్ధి పథంలోకి మళ్లించటం ద్వారా ఉగ్రవాద సంస్థలకు ఊతం ఇవ్వని వాతావరణం నెలకొల్పాలి. ఏడు దశాబ్దాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న, ఉంటున్న పార్టీలు ఆ పనిని చిత్తశుద్ధితో చేయలేకపోయాయి.

370 అధికరణం రద్దు, ఆ తరువాత సాగించిన తీవ్ర నిర్బంధం కాశ్మీర్ ప్రజల మన్ననను పొందలేదని శాసనసభ ఎన్నికల ఫలితాలు చాటి చెప్పాయి. ఉగ్రవాద దాడులను మతకోణంలో చూడడం, విద్వేషాన్ని మరింత పెంచేలా ప్రచారం చేయడం దేశ భవిష్యత్తుకు మంచిది కాదు. ఉన్మత్తత ఆవహించిన ఉగ్రవాదానికి, మతోన్మాదానికి మతమూ, ప్రాంతమూ అన్న విచక్షణ ఉండదు. తమ ఉన్మాదానికి అడ్డొచ్చిన ప్రతి మనిషీ తమకు శత్రువుగానే భావిస్తాయి. పర్యాటకులను కాపాడే ప్రయత్నంలో ప్రాణాలు కోల్పోయిన హార్స్ రైడర్ సయ్యద్ అదిల్ హుస్సేన్ షా ఉదంతమే ఇందుకు ఉదాహరణ. ఇంకో రెండు నెలల్లో అమర్‌నాథ్ యాత్ర జరగనున్న నేపథ్యంలో మోడీ ప్రభుత్వం తగిన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలి. పర్యాటకుల రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సరైన భద్రత లేకపోవడంతో సహా ఉగ్రదాడిపై సమగ్ర దర్యాప్తు జరిపి, ముష్కరులను కఠినంగా శిక్షించాలి. వైఫల్యం పునరావృతం కాకుండా తగు కట్టుదిట్ట చర్యలు తీసుకోవాలి.

# గ్రామ పాలన అధికారుల నియామకంతో భూసమస్యలకు సత్వర పరిష్కారం

## నర్సాపూర్. జి భూభారతి అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.






అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో భూభారతి చట్టంపై అవగాహన సదస్సులు విస్తృతంగా కొనసాగుతున్నాయి. గురువారం నర్సాపూర్. జి మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రజలకు భూభారతి చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల భూ సమస్యలు సులువుగా పరిష్కరించేందుకు వీలుగా నూతన భూభారతి చట్టం రూపొందించబడిందని తెలిపారు. గ్రామాల్లో గ్రామ పాలన అధికారులను నియమించడం ద్వారా, ప్రజల భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. ఎంతోమంది అనుభవజ్ఞులైన అధికారులు, భూ చట్టాల నిపుణులు, న్యాయ నిపుణులు రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను తెలుసుకొని, ఎన్నో రాష్ట్రాల భూ చట్టాలను పరిశీలించిన తర్వాత సమగ్ర భూభారతి చట్టాన్ని రూపొందించారని తెలిపారు. నూతన భారతి చట్టం అమలుతో తహసీల్దార్ స్థాయిలోనే ఎన్నో భూ సమస్యలు పరిష్కారం అవుతాయి అని అన్నారు. అన్ని భూ సమస్యల దరఖాస్తుల పరిష్కారానికి నిర్ణీత గడువును విధించారని తెలిపారు. సాదా బైనామా ప్రక్రియ తిరిగి వినియోగంలోకి రాబోతుందని అన్నారు. భవిష్యత్తులో ఎటువంటి భూ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకై రైతుల పట్టాదారు పాసుపుస్తకంలో వారి భూములకు సంబంధించి వివరాలను మ్యాపింగ్ రూపంలో పొందుపరుస్తారన్నారు. ఈ సమావేశంలో భాగంగా రైతుల ఎదుర్కొంటున్న పలు భూ సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. భూభారతి చట్టం ద్వారా అన్ని భూ సమస్యల పరిష్కారం లభిస్తుందని వారికి హామీ ఇచ్చారు. ఈ భూభారతి అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో పుష్పలత, మండల ప్రత్యేక అధికారి అంజి ప్రసాద్, రైతులు ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## యుజిసి,నీట్ పరీక్ష పై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి తో కలసి విద్యా, వైద్యశాఖ, సంబంధిత అధికారులు, ప్రిన్సిపల్స్ తో సమీక్ష నిర్వహించారు.






అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే నెల మే 4 వ తేదిన మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు జరగనున్న నీట్ పరీక్ష కు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాలలో త్రాగునీరు, నిరంతర విద్యుత్, శానిటేషన్, బెంచీలు, బస్ సౌకర్యం తదితర ఏర్పాట్లను పూర్తి చేయాలనీ, అన్నారు. తరగతి గదులు, బెంచీలు, శుభ్రం చేయాలనీ, తదితర ఏర్పాట్లు ఈ నెల 30 లోగా అన్ని పరీక్ష కేంద్రాలలో మౌళిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ అశోక్, డీఈఓ, ప్రిన్సిపల్స్, తదితరులు పాల్గొన్నారు.

# కాశ్మీర్లో పర్యటకులపై దాడులు చేసిన ఉగ్రవాదులను అంతమొందించాలి

## మరణించిన గాయపడిన పౌరులకు నష్టపరిహారం చెల్లించాలి

## ...ఆదివాసి కాంగ్రెస్ పార్టీ నిర్మల్ జిల్లా చైర్మన్ బాణావత్ గోవింద నాయక్

అమృత్ తెలంగాణ ఖానాపూర్ న్యూస్ : కాశ్మీర్లో పహాల్గం లో పోలీస్ మారువేషంలో వచ్చి విచక్షణ రహితంగా పర్యటకులపై బుల్లెట్ తో దాడులు చేసిన పాకిస్తాన్ ప్రేరేపిత లస్కార్ తోహిబా ఉగ్రవాదులను అంతమొందించాలని ఆదివాసి కాంగ్రెస్ పార్టీ నిర్మల్ జిల్లా చైర్మన్ బాణావత్ గోవింద నాయక్ మాట్లాడుతూ ఉగ్రదాడిలో మరణించిన వారికి కోటి రూపాయలు గాయపడిన పౌరులకు 25 లక్షల నష్టపరిహారాన్ని కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలన్నారు. కాశ్మీర్లో పర్యటకులను కీరతాకంగా చంపిన జిహాదీపాక్ ప్రేరేపిత లస్కారే తోహిబా ఉగ్రవాదులను గుర్తించి అంతమొందించాలని పిలుపునిచ్చారు. వాణిజ్య వ్యాపార పర్యటక రంగాలపై ఆంక్షలు విధించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు సామాన్య పౌరులపై ఉగ్రవాదులు దాడులు హెయామైనా చర్య అని ప్రశాంతంగా ఉన్న కాశ్మీర్లో అలజడి సృష్టించడమే పాక్ ప్రధాన ఉద్దేశమన్నారు. ఉగ్రవాదని కట్టడి చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిందని ధ్వజమెత్తారు దేశవ్యాప్తంగాఉన్న ఈఘటనను ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు ఈ ఘటనలో గాయాలైన వారికి కేంద్ర ప్రభుత్వం అత్యధిక వైద్యం అందించాలని డిమాండ్ చేశారు మృతి చెందిన భారత పౌరుల కుటుంబాలకు ఆదివాసి కాంగ్రెస్ పార్టీ ప్రగాఢ సానుభూతి సంతాపం వ్యక్తం చేశారు



## నూతనంగా జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా శ్రీమతి ఎస్.శ్రీవాణి నియమితులై బాధ్యత స్వీకరించిన సందర్భంగా నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్. మర్యాదపూర్వకంగా కలిసి పుష్పకూర్చాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ నూతనంగా జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా శ్రీమతి ఎస్.శ్రీవాణి నియమితులై బాధ్యత స్వీకరించిన సందర్భంగా గురువారం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కార్యాలయంలో నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్. మర్యాదపూర్వకంగా కలిసి పుష్పకూర్చాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎస్పీ తో పాటు అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, అవినాష్ కుమార్ ఐపిఎస్, ఏ.ఎస్పీ భైంసా, రాజేష్ మీన ఐపిఎస్, ఏ.ఎస్పీ నిర్మల్, నిర్మల్ పట్టణ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ మరియు నిర్మల్ గ్రామీణ సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలో రౌడీయిజాన్ని కనుమరుగు చేస్తాం.







**ప్రతినెల రౌడీల పై తనిఖీలు.**
**పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**
**జిల్లా ప్రజలకు ప్రశాంత వాతావరణం కల్పించడమే,**
**నేర రహిత సమాజాన్ని నిర్మించడం లక్ష్యం.**
**ఎలాంటి నేరాలకు, అసాంఘిక కార్యకలాపాలకు,**
**బెదిరింపులకు, దందాలకు పాల్పడరాదు**
**ఆదిలాబాద్ సబ్ డివిజనల్ పరిధిలో రౌడీ షీట్లు**
**ఉన్న వారితో రౌడీ మేల నిర్వహణ.**
**పద్ధతి మార్చుకోని వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తాం**
**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్.**

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి ఫ రౌడీలు ప్రవర్తన మార్చుకోకపోతే అన్ని రకాలుగా అణచివేస్తామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ హెచ్చరించారు. ఈరోజు ఉదయం స్థానిక ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ నందు ఆదిలాబాద్ సబ్ డివిజనల్ పరిధిలో రౌడీషీట్లు నమోదైన వారితో రౌడీ మేళ సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన ఐపిఎస్ మాట్లాడుతూ, రౌడీయిజం నిర్వహిస్తే చట్టపరమైన కేసులు నమోదు చేస్తూ అన్ని రకాలుగా అష్టదిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. సత్ప్రవర్తన కలిగిన వారికి రౌడీషీట్లు తొలగించి సరైన న్యాయం చేస్తామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలను బెదిరించడం, డబ్బులు వసూలు చేయడం, రౌడీయిజం చేయడం లాంటివి మానుకోవాలని సూచించారు. రౌడీలపై ఉన్న కేసుల వివరాలను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ, నమోదైన కేసులను న్యాయస్థానాల నందు శిక్షణ పడేవిధంగా కృషి చేస్తూ బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు ప్రశాంత వాతావరణ కల్పించడానికి తన వంతు పూర్తిస్థాయిలో కృషి చేస్తూ విధులు నిర్వర్తించడం జరుగుతుందని తెలిపారు. రౌడీషీట్లో ఉన్న వారందరూ మళ్ళీ తిరిగి గంజాయి దందా మట్కా దందా, రౌడీ ఇజం, హత్యలు, హత్యాయత్నాలు, నేరాలు, ప్రజలను బెదిరించడం, కొట్లాటలు, గొడవలు, లాంటివి మొదలుపెట్టిన వారిపై పిడి యాక్టర్ నమోదుకు సైతం వెనకాడ బోనని హెచ్చరించారు. అదేవిధంగా సోషల్ మీడియాలో కత్తులతో పోస్టులు పెట్టడం, రెచ్చగొట్టడం, రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తూ ప్రజలను భయభ్రాంతులను గురి చేయడం, లాంటివి చేస్తే సహించేది లేదని తెలిపారు. నేరాలు లేని సమాజాన్ని తయారు చేయడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం అహర్నిశలు కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, సిఐలు బి సునీల్ కుమార్, సిహెచ్ కరుణాకర్ రావు, డి సాయినాథ్, కే ఫణి ధర్, సిబ్బంది పాల్గొన్నారు.

# రాంచెరువు మత్తడి కాలువపై స్లాబులు
# మంచిర్యాలలో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు
## చోద్యం చూస్తున్న అధికారులు



మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 24 :అమృత్ తెలంగాణ: మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు సాగుతున్నాయి. రాంచెరువు మత్తడి కాలువ పక్కన భవనాలు కట్టుకున్న యజమానులు.. ఏకంగా ఆ కాలువపైనే స్లాబులు నిర్మించుకొని తమ ఇళ్లకు వెళ్లేలా దర్జాగా దారులు ఏర్పాటు చేసుకుంటున్నారు. యేటా వర్షాకాలంలో జన్మభూమినగర్, హైటెక్ కాలనీల మధ్యనున్న రాంచెరువు నుంచి మత్తడి ద్వారా భారీగా వరద వెళ్తుంది. గతంలో ఈ మత్తడి ద్వారా వచ్చే వరదంతా నివాస ప్రాంతాల్లోకి వెళ్లగా, అందుకు శాశ్వత పరిష్కారంగా సుమారుగా 20 అడుగుల వెడల్పుతో రాంచెరువు నుంచి జన్మభూమినగర్, గౌతమీనగర్, ఇస్లాంపుర, రాళ్లపేట, రెడ్డికాలనీల మీదుగా రాళ్లవాగు వరకు మత్తడి కాలువ నిర్మించారు. అయితే, గౌతమీనగర్, ఇస్లాంపుర ప్రాంతాల్లో అక్కడక్కడా కాలువ వెడల్పు తగ్గింది. తాజాగా రాళ్లపేట, రెడ్డికాలనీల మధ్య పలువురు నిర్మించిన భవనాలకు ముందు ఉన్న కాలువపై స్లాబులు నిర్మిస్తున్నారు. గతంలో జన్మభూమినగర్ ఏరియాలో కమర్షియల్ బిల్డింగ్‌లకు ముందున్న కాలువపై ఎవరికి వారు వంతెనలు నిర్మించుకున్నారు. ప్రస్తుతం బైపాస్‌రోడ్డులో కాలువ పక్కనున్న స్థలాల్లో భవనాలు నిర్మించుకున్న వారు.. తమ ఇళ్లకు వెళ్లేలా ఆ కాలువపై స్లాబులు నిర్మిస్తున్నారు. పలువురు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు ఉంటున్నారు. ఈ విషయాన్ని కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారి సంపత్ దృష్టికి తీసుకెళ్లగా, తమ సిబ్బందిని పంపి తగిన చర్యలు తీసుకుంటానన్నారు.

# హైదరాబాద్‌కు దీటుగా విద్యను అందిస్తున్నాం..
## స్టేట్ ర్యాంకర్లను సన్మానించిన అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి




నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 24 :అమృత్ తెలంగాణ: హైదరాబాద్‌లోని కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా నిర్మల్‌లోని అల్ఫోర్స్ విద్యాసంస్థలు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. ఇంటర్మీడియట్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా టాపర్లను గురువారం అల్ఫోర్స్ బాలికల జూనియర్ కళాశాలలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ కళాశాలను నమ్మి తల్లిదండ్రులు మెరిట్ స్టూడెంట్‌లను అప్పజెప్పినందుకు ధన్యవాదాలు తెలిపారు. అల్ఫోర్స్‌లో విద్యతోపాటు విలువలను అందిస్తున్నామని అన్నారు. మున్ముందు హైదరాబాద్ కళాశాలలకు దీటుగా అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మరెన్నో మంచి ర్యాంకులు సాధించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులు..

ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో ఉమ్మడి జిల్లా టాపర్స్‌గా కృ ష్ణవేణి 468, జోసి ప్రసూన శ్రీ 468, కీర్తిశ్రీ 468, బాలు ర విభాగంలో శ్రీ చరణ్ 467, అఖిల్ 467, కార్తికేయన్ 467 మార్కులు సాధించారు. బైపీసీలో సామఫిర్దోస్, మహవీర్, నబిలా తహరీమ్ 438 మార్కులు సాధించారు. సెకండియర్ ఎంపీసీ, బైపీసీలో కమల్ ప్రీత్ కౌర్ 995, సుమయ ఖానం 994, జాదవ్ నవ్యశ్రీ 993 మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు.

# సెస్ ను ఎన్పీడీసీఎల్ లో విలీనానికి కుట్రలు.. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు



సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 24: అమృత్ తెలంగాణ:సెస్ సంస్థతో ఎటువంటి సంబంధం లేని కొంత మంది వ్యక్తులు ఎన్పీడీసీఎల్ లో విలీనం చేయాలని కుట్రలు చేస్తున్నారని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అధ్యక్షతన గురువారం సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) 51వ మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చిక్కాల రామారావు సెస్ తో సంబంధం లేని వ్యక్తులు సంస్థపై అసత్య ఆరోపణలు చేస్తూ ఎన్పీడీసీఎల్ లో విలీనం చేయాలని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తమ పాలకవర్గం ఉన్నంత కాలం ఎట్టిపరిస్థితులలో విలీనం అనేది జరగనీయబోమని స్పష్టం చేశారు లాభాల బాటలో ఉన్న సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఎన్పీడీసీఎల్ గైడ్లెన్సులోనే సంస్థ పని చేస్తుందని పేర్కొన్నారు. ప్రధానంగా ప్రభుత్వ రంగ సంస్థల నుండి భారీగా విద్యుత్ బకాయిలు ఉన్నాయని అన్నారు. ఆయా చోట్ల విద్యుత్ చౌర్యం వలన సంస్థ నష్టాలలోకి వెళ్లిందని, విద్యుత్ చౌర్యాన్ని అరికట్టేందుకు ఉద్యోగులు తగు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. తమ పాలకవర్గం ఏర్పడి తరువాత ఎటువంటి ఉద్యోగ నియామకాలు చేపట్టలేదని, ఎన్పీడీసీఎల్ ద్వారా నియామకాల భర్తీకి చర్యలు తీసుకుంటామని తమ ప్రమేయం ఏమాత్రం ఉండదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, డైరెక్టర్లు దిడ్డి మాదవి, దార్నం లక్ష్మీనారాయణ, మల్లుగారి రవీందర్రెడ్డి, నారాయణరావు, అంజిరెడ్డి, వరుస కృష్ణహరి, మాడుగుల మల్లేశం, పొన్నాల శ్రీనివాసరావు, ఆకుల గంగారాం, నామాల ఉమ, రేగులపాటి హరిచరణ్ రావు, కొట్టిపల్లి సుధాకర్, ఆకుల దేవరాజం, సెస్ మేనేజర్ విజయేందర్రెడ్డి, పాల్గొన్నారు.


# నష్టపరిహారం అందించాలి



కోనరావుపేట, ఏప్రిల్ 24:అమృత్ తెలంగాణ: వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎగ్లాస్‌పూర్‌లో రెండు రోజుల క్రితం వడగండ్ల వానతో రాలిపోయిన వరిని గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమ బాధలు చెప్పుకొంటూ కన్నీటి పర్యంతమయ్యారు. నాలుగు నెలల పంట నాలుగు నిమిషాల్లో నేలపాలైందని గోడు వెళ్లబోసుకున్నారు. అనంతరం చల్మెడ రైతులకు భరోసా కల్పించి, మాట్లాడారు. పంట చేతికొచ్చే దశలో 150 ఎకరాల్లో నేలరాలి పోవడం బాధాకరమన్నారు. పూర్తి స్థాయిలో రైతు రుణమాఫీ కాక, రైతుభరోసా అందక, రైతుబీమా లేక రైతులు ఆగమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందించేలా విప్ కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, సింగిల్ విండో చైర్మన్లు సంకినేని రామ్మోహన్‌రావు, నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, నేతలు గోపు పరశురాములు, కెంద గంగాధర్, వంశీకృష్ణరావు, శ్రీనివాస్ ఉన్నారు.

# ఇందూరుతో బీఆర్ఎస్‌ది పేగు బంధం

**పార్టీకి తొలి అధికార పదవినందించిన జిల్లా**
**కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయడంలోనూ నిజామాబాద్‌దే ప్రధాన పాత్ర**
**వరంగల్ సభకు గులాబీ శ్రేణులు సమాయత్తం కావాలి**
**రజతోత్సవం.. తెలంగాణ ఇంటి పండుగ లాంటిది**
**రేవంత్ ది దిక్కూచి లేని దిక్కుమాలిన పాలన**
**బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి**



ఖలీల్‌వాడి, ఏప్రిల్ 24: అమృత్ తెలంగాణ:నిజామాబాద్ జిల్లాతో బీఆర్ఎస్‌ది పేగు బంధమని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత పార్టీకి తొలి అధికార పదవిని అందించిన చరిత్ర నిజామాబాద్ జిల్లాదని గుర్తుచేశారు. మళ్లీ పార్టీకి పూర్వవైభవం తీసుకురావడంలో, కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా చేయడంలో కూడా ఇందూరు జిల్లా ప్రధాన పాత్ర పోషిస్తుందని చెప్పారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకులతో సమావేశమయ్యారు. ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తితో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లేందుకు చేస్తున్న ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలివెళ్లేందుకు జిల్లా వ్యాప్తంగా గులాబీ శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. 'ఇందూరు జిల్లా పంతం, ఇందిరమ్మ హింసారాజ్యం అంతం' అనే దీక్షతో వరంగల్ బాటపడదా మన్నారు. సమైక్యాంధ్ర పాలనలో ఆర్మూర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ప్లీనరీ సందర్భంగా 'ఆర్మూర్ ప్లీనరీ పంతం, తెలంగాణ సొంతం, సమైక్య పాలన అంతం' అనే నినాదంతో పనిచేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అలాగే ఇప్పుడు కూడా వరంగల్ రజతోత్సవ సభ స్ఫూర్తిగా ఆర్మూర్ నియోజక వర్గంలో 'గులాబీ ఆర్మీ పంతం –దుష్ట కాంగ్రెస్, భ్రష్ట బీజేపీల అంతం' అనే దీక్ష చేపడదామని అన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవాన్ని తెలంగాణ ఇంటి పార్టీ పండుగగా ఆయన అభివర్ణించారు. ఓరుగల్లు పోరుగడ్డకు తండోప తండాలుగా తరలివెళ్లి, కేసీఆర్ నాయకత్వానికి అండగా నిలుద్దామని జీవన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్మూరు టూ వరంగల్ గులాబీమయం చేద్దామన్నారు. నేతలు, కార్యకర్తలు గులాబీ దుస్తులు ధరించి కదం తొక్కాలని కోరారు.

కేసీఆర్ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నరు..

హామీ ఇవ్వక పోయినా 13 లక్షల మంది పేదింటి ఆడపిల్లలకు 11వేల కోట్లు ఖర్చుపెట్టి కల్యాణలక్ష్మి పథకాన్ని అమలుచేసిన ఘనత తెలంగాణ తొలిసీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రైతుబంధు, రైతుబీమా, ఉచిత చేప పిల్లలు, గొర్రెల పంపిణీ, కేసీఆర్ కిట్, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్, కంటి వెలుగు, అమ్మ ఒడి, హాస్టల్ విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం ఇలా అనేక పథకాలు చెప్పకపోయినా అమలు చేశామని జీవన్‌రెడ్డి వివరించారు. రుణమాఫీ, రైతు భరోసా, కల్యాణ లక్ష్మి, కొత్త ఇరిగేషన్ ప్రాజెక్టులు, 24గంటల కరెంట్, ఇంటింటికీ మిషన్ భగీరథ జలాలు, మెరుగైన వైద్యం, సర్కారు విద్యా సంస్థల్లో సౌకర్యాలు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగావకాశాలు, పింఛన్లు మళ్లీ కావాలంటే బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ రావాల్సిందేనని స్పష్టం చేశారు.

తెలంగాణ సుభిక్షంగా ఉండాలంటే మళ్లీ కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని జీవన్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సుజిత్ సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్, శేఖర్, రాజేశ్వర్ రెడ్డి, వెల్మల్ రాజన్న, మచ్చర్ల సాగర్, మస్త ప్రభాకర్, పూజా నరేందర్, ముత్యం, రజనీష్, పోల సుధాకర్, అభిలాష్, ఏజాజ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెహల్గాం మృతులకు పెద్దపల్లిలో జర్నలిస్టుల నివాళులు




పెద్దపల్లి, ఏప్రిల్ 24 :అమృత్ తెలంగాణ: కాశ్మీర్లోని పెహల్గం లో జరిగిన ఉగ్రవాద దాడిలో మృతి చెందిన అమరుల ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షిస్తూ పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జర్నలిస్టుల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కమాన్ చౌరస్తా వద్ద క్యాండిల్ లో వెలిగించి మౌనం పాటించారు. అహల్ఘం లో టెర్రర్ ఎటాక్ ను ఖండిస్తూ పెద్దపల్లి కమాన్ చౌరస్తా వద్ద క్యాండిల్ ర్యాలీ చేపట్టి ఈ సందర్భంగా ఉగ్ర దాడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శాంతి స్థాపన కోసం జరుగుతున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఉగ్రదాడులకు పాల్పడడం అభివృద్ధికి తిలోదకంగా మారుతుందని వారు పేర్కొన్నారు. అమరులైన మృతుల కుటుంబాలు తమ సంతాపాన్ని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా జర్నలిస్టులు బెజ్జంకి నరేష్, కాల్వ రమేష్, అంకరి ప్రకాశ్, గుడ్ల శ్రీనివాస్, వీరమల్ల విద్యా సాగర్, పంది కుమార్, ఏర్రోజు వేణుగోపాల్, తంగళ్ళ పల్లి మధు, తిర్రి తిరుపతి, తిర్రి సుధాకర్, మొలుగురీ సాగర్, ఆర్కుటీ మల్లేష్. బొల్లాం వేణు, పేర్క నీరజ్, పోగుల విజయ్ తోపాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## నాడు గ్రామ స్వరాజ్యం.. నేడు దారిద్ర్యం

# నిరుటి వరకూ పంచాయతీలకు అవార్డుల పంట

హైదరాబాద్, ఏప్రిల్ 24 అమృత్ తెలంగాణ:: బీఆర్ఎస్ హయాంలో పల్లె ప్రగతి పరుగులు పెట్టింది. ప్రతి గ్రామం మెరిసింది. జాతీయ పంచాయతీరాజ్ పురస్కారాల్లో మన గ్రామాలకు అవార్డుల పంట పండింది. కేంద్ర సర్కారు 46 అవార్డులు ప్రకటిస్తే.. ఇందులో 13అవార్డులు తెలంగాణ రాష్ట్రానికే దక్కాయి. దేశ జనాభాలో మూడు శాతం ఉన్న తెలంగాణకు 30శాతం అవార్డులను సాధించింది. మరో ఏడాది ఏకంగా 19 పురస్కారాలు గెలుచుకున్నది. అత్యధిక అవార్డులతో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. 2014నుంచి 2024 వరకు అంటే పదేండ్లలో తెలంగాణ పల్లెలు మొత్తం 69 అవార్డులు సాధించాయి. జిల్లా పరిషత్‌లు 8, మండల పరిషత్‌లు 17జాతీయ అవార్డులు కైవసం చేసుకున్నాయి. మొత్తం 94 పురస్కారాలు దక్కించుకున్నాయి. ఇదంతా గతం. కేసీఆర్ హయాంలో మెరిసి.. మురిసిన పల్లెలు నేడు వెలవెలబోతున్నాయి. కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో కనీస వసతులు కల్పించలేని పరిస్థితి దాపురించింది. జాతీయ పంచాయతీ అవార్డు ఒక్కటీ సాధించడం గగనంగా మారింది. అంటే.. పల్లెల్లో పరిస్థితి ఎంత దారుణంగా మారిందో దీనిని చూస్తే అర్థమవుతున్నది.

డబుల్ ఇంజిన్ సర్కారును దాటి అవార్డుల పంట

కేంద్ర ప్రభుత్వం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ స్వశక్తి కరణ్ (డీడీయూపీఎస్‌వీపీ) 2021-22 జాతీయ పంచాయతీ అవార్డులను ప్రకటించింది. మొత్తం తొమ్మిది అంశాల ఆధారంగా నాలుగు క్యాటగిరీల్లో అవార్డులు ప్రకటించగా అత్యధికంగా తెలంగాణలోని గ్రామాలకే వచ్చాయి. మొదటి, రెండోస్థానంలోనే రాష్ట్ర పంచాయతీలు నిలిచాయి. డబుల్ ఇంజిన్ సర్కారుగా చెప్పుకునే బీజేపీ పాలిత రాష్ట్రాలను తలదన్నేరీతిలో అవార్డుల్లో తెలంగాణ టాప్‌లో నిలిచింది. 2013-14 ఆర్థిక సంవత్సరంలో ఐదు అవార్డులు, ఆ తర్వాత వరుసగా 8 అవార్డుల చొప్పున తెలంగాణ తన ఖాతాలో వేసుకున్నది. 2018-19లో 10 అవార్డులు, ఆ తర్వాత 12 అవార్డులు, 2020-21 సంవత్సరంలో అవార్డుల్లో కొత్త చరిత్ర సృష్టించింది. ఏకంగా19 అవార్డులు సాధించింది. 2021-22లో 13 అవార్డులు సాధించింది. ఎక్కువ అవార్డులు దక్కుతున్నాయని తెలంగాణకు ప్రాధాన్యం తగ్గించడం, తొమ్మిది అంశాలను పరిగణనలోకి తీసుకోకపోవడం, మండల పరిషత్‌లు, జి ల్లా పరిషత్‌లకు అవార్డులు నిలిపివేయడం మూలంగా 2022-23లో ఒక్కటే అవార్డు దక్కింది. ఆ తర్వాతి సంవత్సరంలో రెండు క్యాటగిరీల్లో రెండు ప్రతిపాదనలు పంపగా, ఒక్క అవార్డు చిక్కింది.

ఒకటి కాదు.. రెండు కాదు.. 8 అంశాల్లో

ఒకటి కాదు.. రెండు.. ఎనిమిది అంశా ల్లో మన పంచాయతీలు స్వయం సమృద్ధి సాధించాయి. అవార్డు పంట పండించాయి. ఆరోగ్యవంతమైన పంచాయతీ, నీటి సమృద్ధి ఉన్న పంచాయతీ, సామాజిక భద్రత ఉన్న పంచాయతీ, మహిళల సన్నిహిత పంచాయతీ, పేదరిక నిర్మూలన, జీవనోపాధి పెంచిన పంచాయతీ, సుపరిపాలన, క్లీన్ అడ్ గ్రీన్ పంచాయతీ.. ఇలా ఎనిమిది అంశాల్లో తెలంగాణ గ్రామాల్లో అవార్డులు జాతీయ అవార్డులు సాధించాయి. అనేక పల్లెలు సర్వతోముఖాభివృద్ధి సాధించాయి. మరోవైపు దేశంలో వందశాతం బహిరంగ మల మూత్ర విసర్జనరహిత (ఓడీఎఫ్) ప్లస్ రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించింది.



గ్రామీణ స్వచ్ఛ సర్వేక్షణ్‌లోనూ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది.

అవార్డుల పంట ఎలా పండిందంటే..

కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేసిన పల్లె ప్రగతి మూలంగానే జాతీయ అవార్డుల పంట పండింది. ప్రతి గ్రామానికి ట్రాక్టర్, వైకుంఠధామం, పల్లె ప్రకృతివనం, నర్సరీ, డంపింగ్ షెడ్ ఏర్పాటుతోపాటు పంచాయతీ కార్యదర్శిని నియమించారు. కేంద్రంతో సమానంగా నిధులను విడుదల చేశారు. ప్రతిగ్రామంలో ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ ద్వారా రక్షిత తాగునీరు అందించారు. నూతన పంచాయతీ చట్టాన్ని తీసుకొచ్చి మొక్కల పెంపకానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. నాటిన మొక్కల్లో 85శాతం మొక్కలు బతకాల్సిందేనని చట్టంలో పొందుపర్చారు. దీంతో ప్రతిపల్లె నందనవనంగా మారింది. తెలంగాణలోని గ్రామాలు, పట్టణాలు అన్ని కూడా అభివృద్ధి బాట పట్టాయి. జాతీయ అవార్డులే ఇందుకు నిదర్శనం.

మాల్ పంచాయతీకి జాతీయ ఉత్తమ అవార్డు

రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మాల్ జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపిక కాగా గురువారం బీహార్‌లోని మధుబనిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ పంచాయతీ కార్యదర్శి రాజు ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఆత్మ నిర్భర్ భారత్ పంచాయతీ ప్రత్యేక విభాగంలో మాల్ జాతీయ ఉత్తమ అవార్డుకు ఎంపికైన విషయం తెలిసిందే - యాచారం

కాంగ్రెస్ పాలనలో పడకేసిన ప్రగతి

పదేండ్ల కేసీఆర్ పాలనలో ప్రతి పల్లె సింగిడి సకల సౌకర్యాలతో వర్ధిల్లితే.. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో సమస్యల సుడిగుండంలో చిక్కుకున్నది. స్థానిక సంస్థలకు ఎన్నికల నిర్వహించకపోవడంతో పట్టించుకునే నాథుడు లేక గ్రామాలు అనాథల్లా మారాయి. కేంద్రం నుంచి, 15వ ప్రణాళికా సంఘం నుంచి కూడా నిధుల విడుదల నిలిచిపోయింది. పంచాయతీ కార్మికులకు సకాలంలో జీతాలు అందడం లేదు. ఇప్పటికే మూడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు కూడాకార్యదర్శిచేతిలో చిల్లిగవ్వఉండటంలేదు.మురుగు కాల్వలు పొంగిపొర్లుతున్నాయి. నీళ్లు పోసే దిక్కు లేక కేసీఆర్ హయాంలో నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి. అనేక చోట్ల తాగునీటి కోసం ఖాళీ బిందెలతో రోడ్డు ఎక్కుతున్న మహిళల ఫొటోలు మళ్లీ మీడియాలో కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ పాలనలో ఇలాంటి దారుణ పరిస్థితులు ఉన్నందున ఇక రాష్ట్రానికి కేంద్ర అవార్డులు రావడం కష్టతరంగా మారనున్నది.

# కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా

కంఠేశ్వర్, ఏప్రిల్ 24 :అమృత్ తెలంగాణ: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్, మినీ టీచర్స్ అందరికీ మే నెలలో ఒకేసారి సెలవులు అమలు చేయాలని అంగన్‌వాడీ టీచర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏవో ప్రశాంత్‌తోపాటు ఐసీడీఎస్ సూపరింటెండెంట్ ఇంద్రకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం మే నెలలో ఒకేసారి అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, మినీ టీచర్లకు వెంటనే సెలవులు ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి




చేశారు. ఉద్యోగ విరమణ చేసిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రిటర్మెంట్ బెనిఫిట్స్, మినీ టీచర్లకు వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దేవగంగు, స్వర్ణ, జిల్లా నాయకులు మంగమ్మ, శివరాజమ్మ, రాజ్యలక్ష్మి, విజయ, గోదావరి, ప్రమీల, జ్యోతి, లక్ష్మి, వాణి, సునీత పాల్గొన్నారు.

# శత్రుదేశాలకు దీటైన సమాధానం ఇవ్వాలి

వేల్పూర్ , ఏప్రిల్ 24:అమృత్ తెలంగాణ: జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో మంగళవారం జరిగిన ఉగ్రవాద దాడిని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. వేల్పూర్ మండల కేంద్రంలో పహల్గాంలో ఉగ్రవాదుల కాల్పు ల్లో మరణించిన వారికి గురువారం ఆయన నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకురాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. పహల్గాంలో యాత్రికులపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులతోపాటు ప్రోత్సహించిన సంస్థలపై శత్రుదేశాలకు భారత్ దీటైనా సమాధానం చెప్పాలన్నారు. పహల్గాం ఘటనను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదని తెలిపారు. భారత్‌ను ఎదుర్కొనే దమ్ములేక శత్రుదేశాలు పిరికిపంద చర్యలకు పాల్పడుతున్నాయని ఆగ్రహం



వ్యక్తంచేశారు. ఇంటలిజెన్స్ వైఫల్యం వల్లే ముష్కరులు ఈ చర్యలకు పాల్పడే సాహసం చేశారని అన్నారు. మళ్లీ ఇలాంటి దాడులు జరగకుండా భద్రతను కట్టుదిట్టం చేయడంతోపాటు ఇంటలిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేయడంపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉన్నదన్నారు. భారత సైన్యం, ప్రజల్లో ఆత్మస్థైర్యం దెబ్బ తినకుండా దాడులు చేసిన ముష్కరులపై చెంపపెట్టు లాంటి చర్యలు కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రేగుల్ల రాములు, పిట్ల సత్యం, బాల్కొండ, భీమ్‌గల్, వేల్పూర్, కమ్మర్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్లు ప్రవీణ్‌రెడ్డి, దొన్కంటి నర్సయ్యం, నాగధర్, దేవేందర్, దోళ్ల రాజేశ్వర్‌రెడ్డి, నడ్కుడ గంగారెడ్డి , మొండి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఏంటి జాన్వి ఫన్ కోసమే అలా చేస్తుందా..?



బాలీవుడ్ స్టార్ తనయ జాన్వి కపూర్ సినిమాతో ఈక్వల్ గా సోషల్ మీడియాలో తన పాపులారిటీ చూపిస్తుంది. సినిమాల లెక్క ఎలా ఉన్నా సరే సోషల్ మీడియా క్రేజ్ తోనే ఆమె అదరగొట్టేస్తుంది. అయితే జాన్వి మాత్రం రివర్స్ లో తను సోషల్ మీడియాని అసలు పట్టించుకోనని అంటుంది. జాన్వి కపూర్ ఇన్ స్టాగ్రాం లో 20 మిల్లియన్లకు పైగా ఫాలోవర్స్ ఉన్నారు. వారిని అలరించేందుకే రకరకాల ఫోటో షూట్స్ చేస్తుందేమో అనుకుంటే అసలు తను సోషల్ మీడియాని పట్టించుకోను.. తను కేవలం ఫన్ కోసమే ఫోటోలని సోషల్ మీడియాలో షేర్ చేస్తానని అంటుంది. గ్లామర్ ట్రీట్ తో ఫాలోవర్స్ ని వెర్రి వాళ్లని చేస్తున్న జాన్వి ఈ ఫోటోలు కేవలం ఫన్ కోసమే అంటూ చెప్పి షాక్ ఇచ్చింది. తను ఎంత సరదాగా ఫోటోలు షేర్ చేసినా ఫాలోవర్స్ మాత్రం వాటిని చాలా సీరియస్ గా ఫాలో అవుతున్నారు. జాన్వి ప్రతి ఫోటో షూట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ వస్తున్నాయి. గ్లామర్ ఎటాక్ లో జాన్వి తన ప్రత్యేకతని చూపిస్తుంది. స్టార్ కూతురు అయ్యుండి ఇలా రెచ్చిపోతే నెటిజెన్లు దారుణంగా కామెంట్స్ చేస్తారని తెలిసినా తను అనుకున్నది చేయడంలో వెనక్కి తగ్గట్లేదు జాన్వి కపూర్. అయితే ఈ ఫోటోలు అంతా కూడా తను కావాలని కాకుండా చాలా సరదాగానే షేర్ చేస్తున్నా అని చెప్పుకొచ్చింది. రీసెంట్ గా మిలి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన జాన్వి ఆ సినిమా ఫలితం ఎలా ఉన్నా ఆమె నటనకు మంచి మార్కులు కొట్టేసింది. ఇక సౌత్ సినిమాల మీద జాన్వి ప్రత్యేక ఆసక్తి చూపిస్తుంది. ఛాన్స్ వస్తే తెలుగు సినిమాలో చేయాలని అనుకుంటుంది అమ్మడు. ఇక్కడ ఎన్.టి.ఆర్ తో జత కట్టాలని జాన్వి ఇంట్రెస్ట్ చూపిస్తుంది. సినిమాల్లో కన్నా జాన్వి తన ఫోటో షూట్స్ లోనే తన అందాలకు పని చెబుతుంది. గ్లామర్ షో విషయంలో తనకంటూ ఒక పర్ఫెక్ట్ స్కెచ్ ఉన్నట్టుగా జాన్వి మాటలని బట్టి అర్ధమవుతుంది. రోజు రోజుకి తన స్కిన్ తోనే ఫాలోవర్స్ ని తన బుట్టలో పడేసుకుంటున్న అమ్మడు సినిమా ఫలితాలతో సంబంధం లేకుండా తన క్రేజ్ కొనసాగిస్తుంది.

# టాలీవుడ్‌పై చాలా ఆశలు పెట్టుకుంది..!

ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తాను టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌ను అని, తనకు తెలుగు సినిమా ఇండస్ట్రీ నుంచి అధికంగా ఆఫర్లు వస్తున్నాయని చెప్పుకొచ్చింది. మెగాస్టార్ చిరంజీవితో 'వాల్తేరు వీరయ్య' సినిమాలో బాస్ పార్టీ, బాలకృష్ణతో 'డాకు మహారాజ్' సినిమాలో దబిడి దిబిడి సాంగ్ చేయడం ద్వారా టాలీవుడ్‌లో మోస్ట్ పాపులర్ ఐటెం సాంగ్ హీరోయిన్‌గా ఊర్వశి రౌతేలా నిలిచింది. ప్రస్తుతం టాలీవుడ్‌లో స్టార్ హీరోల సినిమాల్లో ఐటెం సాంగ్ అనగానే ఈ అమ్మడి పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. ఊర్వశి రౌతేలా మాస్ ఐటెం సాంగ్స్‌కి మంచి స్పందన వచ్చింది. ఇప్పటి వరకు తెలుగులో ఈమె చేసిన దాదాపు అన్ని సాంగ్స్ మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో ఎక్కువ ఆఫర్లు వస్తున్నాయి. పైగా హీరోయిన్స్ రేంజ్‌లో ఈమె పారితోషికంను అందుకోవడం కూడా కలిసి వచ్చే అంశంగా చెప్పుకోవచ్చు. పారితోషికం భారీగా దక్కుతున్న నేపథ్యంలో టాలీవుడ్‌లో ఐటెం సాంగ్స్ చేసేందుకు ఈమె చాలా ఆసక్తిగా ఉంది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తాను టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌ను అని, తనకు తెలుగు సినిమా ఇండస్ట్రీ నుంచి అధికంగా ఆఫర్లు వస్తున్నాయని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం టాలీవుడ్‌లో తాను బిజీ స్టార్ అన్నట్లుగా జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన గొప్ప తాను తెగ చెప్పుకుంది. చాలా మంది దర్శకులు నన్ను సంప్రదించేందుకు ప్రయత్నిస్తున్నారు. వారి సినిమాల్లో నన్ను నటింపజేసేందుకు పోటీ పడుతున్నారంటూ కాస్త అతిగా వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుతం ఊర్వశి రౌతేలా చేసిన ఈ వ్యాఖ్యల గురించి ఇండస్ట్రీలో చర్చ జరుగుతోంది. 60 డేస్ ప్లాన్! డాకు మహారాజ్ తర్వాత ఊర్వశి కొత్త సినిమాలతో వచ్చిందే లేదు. బ్లాక్ రోజ్ అనే సినిమాలో నటిస్తుంది. కానీ అది ఎప్పటికీ వస్తుంది అనే విషయమై క్లారిటీ లేదు. అయినా కూడా ఈ అమ్మడు టాలీవుడ్‌లో తనకు వచ్చే అవకాశాల గురించి, ముందు ముందు చేయబోతున్న సినిమాల గురించి చాలానే ఆశలు పెట్టుకుని ఉంది. హిందీలో ప్రస్తుతం రెండు సినిమాల్లో నటిస్తున్నప్పటికీ టాలీవుడ్ పైనే ఈమెకి మోజు ఎక్కువగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఐటెం సాంగ్స్ స్పెషలిస్ట్‌గా పేరు



దక్కించుకున్న ఈ అమ్మడు హీరోయిన్‌గానూ ఆఫర్లు వస్తాయేమో అనే నమ్మకంతో కనిపిస్తుంది. ముందు ముందు ఈ అమ్మడి జోరు ఏ రేంజ్‌లో ఉంటుందో చూడాలి. 2013లో సింగ్ సాబ్ ది గ్రేట్ అనే సినిమాతో బాలీవుడ్‌లో అడుగు పెట్టిన ఈ అమ్మడు దశాబ్ద కాలంలోనే అత్యధిక సినిమాల్లో నటించి మెప్పించింది. పలు సినిమాల్లో గెస్ట్ అప్పియరెన్స్, ప్రత్యేక సాంగ్స్ చేయడం ద్వారా కూడా మరింతగా పాపులారిటీని సొంతం చేసుకుంది. తమిళ్‌లో ఈమె ది లెజెండ్ అనే సినిమాలో ముఖ్య పాత్రలో నటించింది. ఆ తర్వాత తమిళ్ నుంచి ఆఫర్లు వచ్చినా కొన్ని కారణాల వల్ల తిరస్కరించినట్లు సమాచారం అందుతోంది. మొత్తానికి ఊర్వశి రౌతేలా హిందీ, తమిళ్, తెలుగు, బెంగాలీ భాషల్లోనూ నటించడం ద్వారా పాపులారిటీ సొంతం చేసుకుంది. కానీ ప్రస్తుతం ఈమెకు ఉన్న క్రేజ్ నేపథ్యంలో తెలుగు సినిమాలను ఎక్కువ చేయాలని ఆశ పడుతోంది.

# మమితా బైజు డిమాండ్ బాగుంది..!

ఐతే ఎవరైనా హీరోయిన్ తెలుగులో కాస్త క్రేజ్ తెచ్చుకుంటే చాలు వాళ్లకి వరుస ఆఫర్లు వస్తాయి. ప్రేమలు సక్సెస్ తో మమితాకు అలాంటి ఆఫర్లు వచ్చాయి. ప్రేమలు సినిమాతో సౌత్ లో సూపర్ క్రేజ్ తెచ్చుకుంది క్యూట్ బ్యూటీ మమితా బైజు. దాదాపు ఏడెనిమిది ఏళ్లుగా మళయాళంలో నటిస్తూ వచ్చిన మమితా బైజు అక్కడ ఒక మోస్తారు క్రేజ్ తో కెరీర్ కొనసాగిస్తుండగా ప్రేమలు సినిమా ఎప్పుడైతే రిలీజైందో అప్పటి నుంచి అక్కడ మిగతా భాషల్లో కూడా అమ్మడి పాపులారిటీ పెరిగింది. తన క్యూట్ లుక్స్ తో యూత్ ఆడియన్స్ కి ఫేవరెట్ హీరోయిన్ అయ్యింది మమితా బైజు. ప్రేమలుతో తెలుగు యువత మనసులు కూడా గెలుచుకుంది ఈ చిన్నది. ఐతే ఎవరైనా హీరోయిన్ తెలుగులో కాస్త క్రేజ్ తెచ్చుకుంటే చాలు వాళ్లకి వరుస ఆఫర్లు వస్తాయి. ప్రేమలు సక్సెస్ తో మమితాకు అలాంటి ఆఫర్లు వచ్చాయి. కానీ అప్పటికే ఆమె తమిళం, మలయాళ భాషల్లో సినిమాలు ఒకే చేయడం వల్ల ఇక్కడ సినిమాలు కుదరలేదు. ఐతే మమితాకు కూడా పర్సనల్ గా తెలుగు సినిమాల్లో నటించాలన్న ఆలోచన ఉందని తెలుస్తుంది.



## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

## చూపు తిప్పుకోనివ్వని అందం.. 90ఎంఎల్ ఇచ్చినంత కిక్



తెలుగు లో 90ఎంఎల్ సినిమా తో పాటు ఛలో ప్రేమిద్దాం సినిమాలను చేసిన ముద్దుగుమ్మ నేహా సోలంకి. ఈ అమ్మడు మెల్ల మెల్లగా టాలీవుడ్ ప్రేక్షకులకు చేరువ అవుతోంది. అందమైన ఈ అమ్మడి యొక్క అందాల గురించి ఎంత మాట్లాడుకున్నా తక్కువే అన్నట్లుగా ఈ ఫోటో చూస్తుంటే అనిపిస్తుంది అంటూ కామెంట్స్ వస్తున్నాయి. సోషల్ మీడియాలో ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోత పీక్స్ లో ఉంది. తాజాగా ఈ ఫోటోను షేర్ చేసి తనకంటే గొప్ప అందగత్తె ఉందా అన్నట్లుగా నేహా సోలంకి ఛాలెంజ్ విసిరినట్లు గా ఉందంటూ కామెంట్స్ వస్తున్నాయి. ప్రస్తుతం ముద్దుగుమ్మ యొక్క అందం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. క్లీ వేజ్ షో తో పాటు నడుము అందం ను సైడ్ యాంగిల్ లో చూపిస్తూ మతులు పోగొడుతున్న ముద్దుగుమ్మ అందాల విందు కు ప్రతి ఒక్కరు కూడా ఫిదా అవుతున్నారు. ఈ అమ్మడి యొక్క సినిమాల విషయానికి వస్తే గూడుపుఠాణి సినిమాలో నటిస్తోంది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com